క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన
భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు రెడ్డి ఆదేశాలు మేరకు మ్యూనిటీ పోలీసింగ్‌పై పోలీస్ కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు వివిధ అంశాలను విశదీకరించారు. స్కూల్ విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల, షీటీమ్ ప్రాముఖ్యత, సైబర్ క్రైమ్, షీ టీమ్స్, ఆన్లైన్ మోసాలు, హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై వివరించారు. ప్రిన్సిపాల్ వరకాల కొండయ్య, ధనలక్ష్మి, ఇతర టీచర్లు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం
భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 10న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

విచారణ చేపట్టాలి
దుమ్ముగూడెం: పర్ణశాల పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి దాసరి సాయన్న డిమాండ్ చేశారు. లక్ష్మీనగరం గ్రామంలో శనివారం జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్ణశాల పంచాయతీలో రూ.4.70లక్షల వరకు నిధులు దుర్వినియోగం అయ్యాయని, వాటిపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఇర్ప శ్రీను, మిడియం ముదిరాజు, బాబురావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణాలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పాత సీఎస్పీ కాటా ప్రాంతంలో ఎస్‌డీఎఫ్ నిధులైన సుమారు రూ.50లక్షలతో చేపట్టనున్న ఖబర స్తాన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.25కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీపీ కారం విజయ కుమారి, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముసిలం మైనార్టీ సంక్షేమ సమితి నాయకులు, ముస్లిం మిల్లత్ కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ ఎన్నిక
ములకలపల్లి: స్థానిక గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా గొడ్ల రాజు ఎన్నికయ్యారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. ప్రెసిడెంట్‌గా గొడ్ల రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఉపేందర్, జనరల్ సెక్రటరీగా సునీత, సెక్కటరీగా రమాదేవి, ట్రెజరర్‌గా డి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా కొండయ్య, అడ్వయిజర్స్ మెంబర్స్‌గా బిక్కూలాల్, రాంబాబు, తిరుపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయవంతం చేయండి
భద్రాచలంఅర్బన్: భారత స్వాతంత్ర సమర యోధుల ఆకాంక్షల అమలుకోసం, భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని మతవాద తదితర శక్తుల నుంచి కాపాడుకోవడం కోసం ఏర్పాటు చేయబడిన భారత బచావో భద్రాచలం డివిజన్ సదస్సు నేడు ఆదివారం ఉదయం 10 గంటలకు భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో జరగనుందని, సదస్సును విజయవంతం చేయాలని చల్లగుండ్ల నాగేశ్వరరావు, పూనెం వీరభద్రం, టీచర్ రామాచారి తదితర ఆహ్వాన సంఘం బాధ్యులు కోరారు.

వైద్య శిబిరం
అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులోని వలస గొత్తికోయ గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక గ్రామస్తులకు వ్యాధినిరోధక టీకాలు వేసి, జ్వరపీడితులను గుర్తించి చికిత్స అందించారు. ఇద్దరు గర్భిణులను పరీక్షించి, టీకాలు వేశారు. హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, జ్యోతి, ఆశా సీతా, శంకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు చేయూత

- వృత్తి విద్యా కోర్సుల్లో ఐటీసీ ఉచిత శిక్షణ
- యువతీ, యువకులకు తగినట్లుగా కోర్సులు
- వివిధ కంపెనీలలో ఉపాధి కల్పన



బూర్గంపాడు ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న యువకులు



భద్రాచలంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువతులు



శిక్షణ అనంతరం సొంతంగా బ్యూటీ పార్లర్ నడిపిస్తున్న యువతి

సండే స్పెషల్

బూర్గంపాడు: ప్రముఖ కాగితపు పరిశ్రమ ఐటీసీ పీఎస్‌పీడీ నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తోంది. తమ పరిశ్రమతో పాటుగా అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధులను కల్పిస్తుంది. దీంతోపాటుగా ఇతర కంపెనీల్లో పని చేసేందుకు కూడా మార్గం చూపుతోంది. గత ఐదేళ్ల కాలంలో రూ.7 కోట్లు ఖర్చుచేసి వేలాదిమంది యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణనిప్పించింది. శిక్షణ అనంతరం వివిధ కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించింది.

మండల కేంద్రం బూర్గంపాడులో ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచితంగా ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు ఐటీసీ ఫండింగ్ చేస్తూ శిక్షణను కొనసాగిస్తోంది. ఆసక్తి ఉన్న యువతకు మూడునెలలపాటు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ట్రెనింగ్‌నిచ్చి వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శిక్షణా సమయంలో వీరికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సెంటర్‌లో ఐదేళ్ల కాల వ్యవధిలో 4,926మంది నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ట్రెనింగ్ ఇచ్చారు. ఇందులో 3,213 మందికి ఉపాధి కల్పించారు. తోషిబా విజయ్, స్నైడర్, గ్లాండ్ ఫామ్, రేడియంట్, రిలయన్స్ ట్రెండ్స్ వంటి కంపెనీల్లో వీరికి ఉపాధి కల్పించారు. వీరికి నెలకు రూ.18 వేల వరకు వేతనాలు అందుతున్నాయి. దీంతో పాటుగగా ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఐటీకి సంబంధించిన కనీస పరిజ్ఞానం అందిస్తున్నారు.

అదేవిధంగా నిరుద్యోగ యువతులకు ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భద్రాచలంలో ఐటీసీ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపీ కోర్సుల్లో శిక్షణనిస్తున్నారు. ఐదేళ్ల కాల వ్యవధిలో 1,300మంది యువతులకు ఈ సెంటర్‌లో శిక్షణనిచ్చి ఉపాధి కల్పించారు. హైదరాబాద్, విజయవాడలలోని ప్రముఖ బ్యూటీషియన్ సెంటర్‌లు అనూస్, లాక్మే వంటి సంస్థలలో ఉపాధి కల్పించారు. అక్కడ వీరికి కొంతకాలం బ్యూటీషియన్ అడ్వాన్ కోర్సుల్లో శిక్షణనిప్పిస్తున్నారు. ఈ రెండు శిక్షణాకేంద్రాల్లో శిక్షణ పొందిన వారిలో 78శాతం మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి. అదేవిధంగా పలువురు సొంతంగా ఎలక్ట్రీషియన్ షాపులు, బ్యూటీ పార్లర్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఈ సెంటర్‌ల్లో శిక్షణ పొందేవారిలో గిరిజనులే అధికశాతం ఉన్నారు. రానున్న రోజులలో మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐటీసీ ప్రణాళికలను రూపొందిస్తోంది. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త టెక్నికల్ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐటీసీ ఆలోచన చేస్తుంది. రానున్న రోజులలో వృత్తి నైపుణ్యా కేంద్రాలను బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణనిచ్చే దిశగా ఐటీసీ అడుగులు వేస్తుంది.

ఐటీసీ ఉపాధి చూపింది



ఆర్థిక ఇబ్బందులు కారణంగా పదో తరగతి చదివిన తరువాత చదువు మానేశాను. రెండేళ్ల క్రితం బూర్గంపాడులోని ఐటీసీ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌లో చేరాను. ఎలక్ట్రీషియన్ కోర్సులో చేరి ఉచితంగా శిక్షణ పొందాను. ఐటీసీ నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సంపాదించాను. ఎలక్ట్రీషియన్ కోర్సులో మెలకువలు నేర్చుకోవటంతో సొంతంగా కూడా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను.

– గోకవరపు దీపక్‌కుమార్, రామవరం, కొత్తగూడెం

శిక్షణతో పాటుగా ఉపాధి



ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల మూలంగా పదో తరగతిలోనే నా చదువు ఆగిపోయింది. ఎలక్ట్రీషియన్ల వద్ద పనిచేస్తున్న సమయంలో మిత్రుల సలహాతో బూర్గంపాడులోని ఐటీసీ ప్రథమ్ ట్రెనింగ్ ఇనిస్ట్యూట్‌లో చేరాను. అక్కడ నేను ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ తీసుకున్నాను. హైదరాబాద్‌లోని అప్తార్ కంపెనీలో ప్లేస్‌మెంట్ ఇప్పించారు. ఏడాదిపాటు ఉద్యోగం చేసి మానేశాను. ప్రస్తుతం పెద్ద పెద్ద బిల్డింగ్‌లకు ఎలక్ట్రికల్ పనులు చేస్తూ, నాతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నాను.

– గార్లపాటి గణేష్, జూలురుపాడు

సీపీఎం పాదయాత్ర ప్రారంభం



ముంపు కాలనీల్లో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: గోదావరి ముంపు నుంచి భద్రాచలం రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ముంపు కాలనీల్లో సీపీఎం పాదయాత్ర ప్రారంభించింది. పాదయాత్ర ప్రారంభ సభ ఏఎంసీ కాలనీలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ ప్రారంభ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, నియోజకవర్గ కో–కన్వీనర్ కారం పుల్లయ్యలు ప్రసంగించారు. పోలవరం ముంపు నుంచి భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉన్నదని సీపీఎం 2007లోనే హెచ్చరించినా పాలక వర్గాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకొని భద్రాచలం ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణం గోదావరి కరకట్టకు, స్లూయిజ్లకు మరమ్మతులు చేయించి సమర్థవంతమైన మోటార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొదటిరోజు పాదయాత్ర ముంపు కాలనీలైన ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్ప కాలనీలలో కొనసాగింది. పాదయాత్రకు నియోజకవర్గ కో–కన్వీనర్ కారం పుల్లయ్య సారథ్యం వహించగా పాదయాత్ర బృందంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, ఎం.రేణుక, సున్నం గంగా, బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకటరామారావు, పి. సంతోష్ కుమార్, నాదెల్ల లీలావతిలు ఉన్నారు. ప్రారంభ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.బ్రహ్మాచారి, ఎంబి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ, పట్టణ కమిటీ సభ్యులు, నాయకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం..

సీపీఎం ముంపు కాలనీల పాదయాత్రకు సేవ్ భద్రాద్రి అధ్యక్షుడు పాకల దుర్గాప్రసాద్, లయన్స్ క్లబ్ పట్టణ నాయకులు పల్లంటి దేశప్ప, మాలమహానాడు జిల్లా కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్, ఆర్ఎంపీ డా.నాగరాజు బందం సంఘీభావం తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజ్ సునీల్ కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అజీమ్‌లు తమ మద్దతును తెలియజేశారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి
భద్రాచలం: భద్రాచలంలోని గోదావరి ముంపు కాలనీల్లో ముంపు నివారణ చర్యలను ముందస్తుగా ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్యే పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొదెం వీరయ్య మాట్లాడుతూ.. గోదావరి వరద బాధితులకు గత ఏడాది సీఎం కేసీఆర్ ఇచ్చిన రూ.1000 కోట్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. మళ్లీ వరదల సీజన్ వచ్చినా ఇంత వరకు ముందస్తు చర్యలను చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలం సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భద్రాచల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతరేల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, బోగాల శ్రీనివాసరెడ్డి, దుద్దుకూరు సాయిబాబా, సరెళ్ల వెంకటేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొడితే సహించం
సాక్షినెట్‌వర్క్: పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా రోజుకు రూ.1000 ఇచ్చి పోటీ కార్మికులను పెట్టి వారి పొట్టకొడితే ఊరుకునేది లేదని సీఐటీయూ, సీపీఎం నాయకులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. పలువురు నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు రోజుకు రూ.300 వేతనంతో సరిపెడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. సమ్మెలో సందర్భంగా రోజుకు రూ.1000 చెల్లిస్తూ పోటీ కార్మికులను ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అదే వెయ్యి రూపాయల చొప్పున నెలకు 30 వేలు చెల్లిస్తే కార్మికులు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాగా, సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజాపంథా, కాంగ్రెస్ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వేంకటేశ్వర కల్యాణం
అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలను అందజేశారు.

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి
భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం వర్తింపజేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. భద్రాచలం పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో బి.కిశోర్ సింగ్, బి.రాజు, కృష్ణ, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, తావుర్య, విజయ్‌కుమార్, పద్మారాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పేదలకు పోడు పట్టాలిస్తాం



బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

చంద్రుగొండ: మొదటి దఫాలో పట్టాలు అందని గిరిజన పోడుదారులుంటే వారిని గుర్తించి రెండోదఫా పట్టాలు పంపిణీ చేసే ఆలోచనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సీతాయిగూడెం, మద్దుకూరు, మహ్మద్‌నగర్, తిప్పనపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి పోడుభూములకు మంజూరైన పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పోడుపట్టాల సమస్య ఉండేదని, ఈ నేపథ్యంలో నిరసనలు, ఆందోళనలతో కాకుండా సామరస్యంగా ప్రభుత్వం నుంచి పనులు చేయించుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమాల్లో దమ్ముపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ దారావత్ పార్వతి, ఎంపీటీసీలు దార వెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, ఎస్డీ రసూల్, నల్లమోతు వెంకటనారాయణ, మెడా మోహన్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, గాదె లింగయ్య, భూపతి శ్రీనివాసరావు, దారావత్ రామారావు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

దమ్మపేట: మండల పరిధిలోని బీటీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులతో కలసి శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని నాగుపల్లి నుంచి చంద్రాయపాలెం, గుండెపట్వారిగూడెం నుంచి సీతారాంపురం వరకు బీటీ రోడ్లు మంజూరు కాగా, వాటి నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండు బీటీ రోడ్లకు కలిపి నిర్మాణ వ్యయం రూ.2 కోట్ల 40 లక్షలు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం బైక్‌పై ఆయా గ్రామాల్లో తిరిగిన ఎమ్మెల్యే.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందుగా తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో, పార్టీ తరపున ప్రమాద బీమా (రూ.2 లక్షలు) చెక్కును మృతుడు ముక్కిల నాగరాజు తల్లి అంకమ్మకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, అబ్దుల్ జిన్నా, ఎంపీటీసీలు గూడపాటి వెంకట్రావు, భాస్కరరావు, స్థానిక సర్పంచ్‌లు గుండె కోటేశ్వరరావు, సోయం చంటి, వెంకమ్మ, సున్నం రాము, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబసు జయంతి
చంద్రుగొండ: వెస్ట్‌బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు జయంతి వేడుకలను సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటం ఎదుట నాయకులు నివాళులర్పించారు. పెద్దిని వేణు, రాయి రాజా, ఆర్ వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.నాగుల్‌మీరా, వీరభద్రం పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి



టీకాల గురించి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారి రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని ఆసుపాక కాలనీ, గుంటిమడుగు గ్రామాల్లో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులకు సంబంధించిన టీకాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, పనికిరాని వస్తువులను గుర్తించి వాటిలో ఉన్న నీటి నిల్వలు తొలగించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకును పరిశీలించి, తక్షణమే శుభ్రం చేయించాలని జీపీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకు సమాచారం ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాటీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి
దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులవుతున్న బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ములకపాడులోని వైయస్ భవన్‌లో సీపీఎం సోషల్ మీడియా ముఖ్యుల సమావేశం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సీతమ్మ సాగర్ నిర్వాసితులకు మొదటి విడత రూ.8 లక్షలు మాత్రమే ఇచ్చారని, రెండవ విడత భూ సేకరణకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్ బ్రహ్మాచారి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మారాయిగూడెం సర్పంచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన
దమ్మపేట: తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ.. సీపీఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శనివారం దమ్మపేటలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు గో బ్యాక్ మోదీ అంటూ నినదించారు. విభజన హామీలు పూర్తిగా నెరవేర్చిన తరువాత మాత్రమే మోదీ రాష్ట్రానికి రావాలని పేర్కొన్నారు. శివకృష్ణ, ధర్మ, నాగమణి, జాన్‌బీ, కృష్ణవేణి, సత్యావతి పాల్గొన్నారు.

జననేత వైఎస్సార్ జయంతి

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ, టీజేఎస్‌లు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అభిమానుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. ఆయన హయాంలో అందించిన ఆరోగ్యశ్రీ, 108 వంటి సంక్షేమ పథకాలు, వాటికి ద్వారా పేదలకు అందిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జనం కోసం పనిచేసి జననేతగా గుర్తింపు తెచ్చుకున్నారని ఈ సందర్భంగా కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



మణుగూరురూరల్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



చంద్రుగొండ: వేడుకలో ఎంపీపీ పార్వతి..



అశ్వారావుపేటరూరల్: రింగ్‌రోడ్ సెంటర్‌లో..



భద్రాచలం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



అన్నపురెడ్డిపల్లి: వైఎస్ఆర్ చిత్రపటం వద్ద కేక్ కట్ చేస్తున్న అభిమానులు



పినపాక: వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



కరకగూడెం: వైఎస్సాఆర్‌కు జోహార్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బూర్గంపాడు: ప్రధానకూడలిలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న టీజేఎస్ నాయకులు